# 3



# ఒక బంధం కోసం

అరుణ పప్పు

సాగరతీరం. ఎన్ని రహస్యాలనూ రత్నాలనూ తనలో దాచుకుందో ఈ సముద్రం! అపారమైన నీలి జలరాశిని అలా చూస్తుంటే ఇంకా ఇంకా చూడాలనే ఉంటుంది, ఎప్పటికీ అక్కడి నుంచి కదిలి రావాలనిపించదు.

కిక్కిరిసిపోయే జనాలు, మెరిసిపోయే విద్యుద్దీపాలు, గవ్వలతో చేసిన వస్తువుల అమ్మకాలు, చిల్లర వ్యాపారుల పిలుపులు, కొనుగోళ్లతో హడావుడిగా వుండే సమయాలు- బీచ్ సహజ సౌందర్యాన్ని ప్రశాంతంగా ఆస్వాదించాలనుకునే నావంటివారికి అంతగా సరిపడవు. అందుకే నేను సాయంత్రాలు సముద్రపుటొడ్డు కెళ్లడం అరుదనే చెప్పుకోవాలి.

ప్రతి ఉదయం క్షితిజరేఖ నుంచి భానుడు బంగారు బంతిలాగా ఉదయిస్తున్నప్పుడు అంతగా అలికిడి లేని చోటును ఎంచుకుంటాను. వెంట తీసుకెళ్లిన రెల్లుగడ్డి చాపను పరిచి అరగంటసేపు యోగాసనాలు వేస్తాను. తర్వాత పదిహేను నిమిషాల ధ్యానం. మరో పదినిమిషాలు సముద్రగర్భంలోంచి పైకి వస్తున్న దినకరుణ్ని, ఆయనకు స్వాగతం చెబుతూ ఆకాశం కట్టే రంగుల తోరణాన్నీ, పొద్దు పొడుపుతోనే ఆహార సంపాదన కోసం రెక్కలు చాచి పైకెగిరే పక్షులనూ చూస్తూ ప్రభాతాన్ని మనసులోకి పూర్తిగా నింపుకోవడం. ఇవి మూడూ పూర్తయ్యేసరికి రోజంతటినీ ఉత్సాహంగా గడపగల శక్తి ఏదో నాలో చేరుతుంది. కొన్నేళ్లుగా నా ఉదయాలు ఏమాత్రం తేడా లేకుండా ఇలాగే గడుస్తున్నాయి.

నెలరోజులుగా మాత్రం కొత్త విషయమొకటి నా దృష్టిని ఆకర్షించింది. నా ప్రాణాయామం, ధ్యానం పూర్తయ్యే సమయానికల్లా ఓ తండ్రీకొడుకులు సముద్రపు టొడ్డున కబుర్లు చెప్పుకొంటూ విహరించడం నా కంటపడింది. సాధారణంగా అలాంటి ప్రభాత సమయాల్లో బీచ్‌లకు ఎవరూ వ్యాహ్యాళికంటూ రారు. రోజూ నడిచేవారు తప్ప కొత్త ముఖాలు కనిపించడం అరుదు. అప్పుడప్పుడూ ఎవరైనా పర్యాటకులు తూర్పు తీరాన భానోదయాన్ని చూడాలని ఉత్సాహంగా వస్తుంటారు. అటువంటి వాళ్లు ఇవాళ కనిపిస్తే రేపు కనిపించరు. చుట్టపుచూపుగా ఈ ఊరికొచ్చి సరదాపడేవాళ్లు సైతం ఒకటి రెండురోజులు వస్తారు. బహుశా అందువల్లేనేమో ఈ తండ్రీకొడుకుల పట్ల నా ఆసక్తి పెరిగి గమనించడం మొదలుపెట్టాను.

తండ్రి నలభైకి దగ్గరగా ఉంటే కొడుక్కి పన్నెండేళ్లుంటాయేమో. నాకు కాస్త దూరంలో ఓ దుప్పటి పరిచి కూచునేవారు చాలాసార్లు. ఆ వయసు పిల్లలు చాలామందిలా ఆ కుర్రాడు ఇసుకలో ఆడుకోవడం, నీళ్లలో తడుస్తానని అల్లరి చెయ్యడం, అటూఇటూ పరుగులు పెట్టడం... ఇవేవీ చేసేవాడు కాదు. తండ్రి పక్కనే బహుబుద్ధిగా కూచునేవాడు. అతను సముద్రం వైపూ సూర్యుడివైపూ చెయ్యి చూపించి ఏవో చెబుతుంటే వినేవాడు. వారిపట్ల నా ఆసక్తి పెరగడానికి బహుశా ఇదే ముఖ్య కారణమేమో. వాడి చేతిలో ఒకటి రెండుసార్లు రంగురంగుల ప్లాస్టిక్ బంతి ఉండేది. వాళ్ల నాన్న దాన్ని నీళ్లలోకి విసురుతుంటే అది మళ్లీ ఒడ్డుకు కొట్టుకు రావడాన్ని కూడా ఆ అబ్బాయి అలా కదలకుండా కూచునో నిలబడో చూసేవాడు తప్ప అడుగు ముందుకు వేసేవాడే కాదు. పదకొండు, పన్నెండేళ్ల కుర్రాడికి ఆట సరదా

లేకపోవడం ఏమిటి? ఏదైనా అంగవైకల్యమేమోనని పించింది. జాగ్రత్తగా గమనించి చూస్తే కాలూ చెయ్యీ ఏ అవకరమూ ఉన్నట్టు కనిపించదు. చక్కగా తెల్లగా వయసుకు తగిన శరీరంతో మామూలుగానే నడుచు కుంటూ వస్తాడు మరి. పోనీ నీళ్లంటేనో సముద్రమంటేనో భయమేమో. లేదా తండ్రి దగ్గర పెద్ద చనువు లేదేమో. తల్లితో వస్తే ఇంత బుద్ధిగా కూచుంటాడా?

రోజులు గడుస్తున్నకొద్దీ ఆ పిల్లవాణ్ని గమనిం చడం నిత్యకృత్యమయింది నాకు. అందునా నేను పని చేస్తున్నది చిల్డ్రన్ సైకాలజిస్టుగా కూడా కావడంతో నాలోని చదువుకు ఈ అబ్బాయెుక ప్రహేళికగా మారాడు. ఒకరోజు ఉదయం తండ్రి విసిరిన బంతి సముద్రంలో పడకుండా గాలివాటుకు నేనున్నవైపే వచ్చింది. దాని వెనుకే ఆయన కూడా వచ్చి, 'సారీ మేడమ్... సారీ,' అంటూ చెప్పాడు. 'పర్లేదులెండి,' అన్న నా మాటలకు చిన్న చిరునవ్వుతో వెళ్లిపోయాడు.

అప్పటినుంచి నా ఉనికిని ఆయన కూడా గుర్తిం చడం మొదలెట్టాడనుకుంటా, నాలుగైదురోజుల తర్వాత దూరంగా వాళ్లు కూచున్నచోటి నుంచే చెయ్యూ పాడు. నేను నవ్వి ఊరుకున్నా. ఓ వారం పదిరోజుల తర్వాత కొడుకును అక్కడ కూచోబెట్టి నేనున్న చోటికి వచ్చి, "నమస్తే, మీరు రోజూ వస్తుంటారునుకుంటాను. ఇంతకుముందు నేను సరిగా గమనించలేదు..." అన్నా డాయన.

"నమస్కారమండీ. అవును, గడిచిన ఎనిమి దేళ్లుగా రోజూ ఇలాగే వస్తున్నాను," అని చెబితే కాస్త ఆశ్చర్యంగా చూశాడు. 'నా పేరు దీప. ఇక్కడ రామకృష్ణ మఠం వాళ్లు నడుపుతున్న స్కూల్లో చిల్డ్రన్ సైకాలజిస్ట్‌గా పనిచేస్తున్నాను. అప్పుడప్పుడూ తెలుగు క్లాసులు కూడా చెబుతుంటాను..." అన్నాను.

"అవునా, బావుంది. మేం ఢిల్లీ నుంచి కొత్తగా ఇక్కడికొచ్చాం. దాదాపు రెండు నెలలవుతోంది. అవ టానికి తెలుగువాళ్లమేలెండి. అయితే నేను ఈ రాష్ట్రంలో పుట్టి పెరిగినవాణ్ని కాను. అందువల్ల నేను కొంచెం నట్టుతూ తప్పులు మాట్లాడితే ఆ భాషకు ఏమీ అనుకో కండి. అసలే మీరు తెలుగు చెబుతుంటానన్నారు కూడానూ..." అన్నాడాయన. స్వచ్ఛంగా కలుపుగోలుగా మాట్లాడుతున్న అతన్ని చూస్తే ఆ ఉదయాన మనసుకు హాయిగా అనిపించింది.

"సరే, మళ్లీ కలుస్తానండీ. మావాడు భయపడతా డేమో..." అంటూ వెళ్లిపోయాడు. వెళ్లిపోతుంటే తట్టింది- ఇంతకీ అతని పేరేమిటో అడగలేదే అని. ఆ తర్వాత చాలారోజులు దూరం నుంచే చిరునవ్వుతో పలకరించు కోవడం తప్ప పెద్ద సంభాషణేమీ జరగలేదు మా మధ్య. ఆ అబ్బాయి మాత్రం అందరు పిల్లల్లాంటివాడు కాదని మాత్రం అర్థమయింది. ఆ అనుమానం కలిగాక నేనే మాట కలపాలనుకున్నాను.

నా ధ్యానం ముగిశాక ఒకరోజు కాస్త వాళ్లవైపు నడిచాను. నేను ఊహించింది నిజమే. ఆ అబ్బాయికి కాస్త బుద్ధిమాంద్యం ఉన్నదని చూడగానే అర్థమయింది. దగ్గరగా చూడలేదు గనుక అప్పటివరకు నాకా విషయం నికరంగా తెలియలేదు. నేను తనని చూసి నవ్వితే ఆ కుర్రాడు పట్టించుకోకుండా మరోవైపు చూపు నిలిపాడు.

"శుభోదయం సర్," అంటే, "అదేమిటీ సార్ గీర్ అని. అయ్యో దీపగారూ, మీకు నా పేరు చెప్పలేదు కదూ. అయాం గౌతమ్. వీడు మా అబ్బాయి దివిజ్..." అని పరిచయం చేస్తూ, "చూడు నాన్నా, ఈ మిస్ పేరు దీప. హెలో చెప్పు..." అన్నాడాయన ఆ అబ్బాయి వైపు తిరిగి. ఆ కుర్రాడిలో చలనం ఏమీలేదు. తను చూస్తున్న వైపు నుంచి దృష్టి ఏమాత్రం మరల్చనేలేదు.

"అయాం సారీ, తను కాస్త..." అని తడబడ్డాడు తండ్రి.

"నాకు తెలుస్తోంది. హీ ఈజ్ డిఫరెంట్లీ ఏబుల్డ్... నథింగ్ టు వర్రీ..." అన్నాన్నేను.

"డిజేబుల్డ్ అనిగాకుండా డిఫరెంట్లీ ఏబుల్డ్ అనడంలోనే మీ చదువూ సంస్కారం అర్థమవుతున్నా యండీ. ఉదయాన్నే ప్రశాంతంగా ఉంటుందని ఇలా తీసుకొస్తున్నా వీడిని..."

"మంచిదేలెండి. ప్రకృతి మనిషికి మానసిక ప్రశాం తతనిస్తుందండీ. అసలైన ప్రకృతి సౌందర్యాన్ని దట్టమైన అరణ్యాల్లోనూ సముద్రాల దగ్గరా చూడమన్నాడు కాళిదాస కవి..."

"మీరు తెలుగు చెప్తారని తెలుసుగానీ, మరీ కాళి దాసుతో ముచ్చట్లాడేంత స్నేహం మీకుందని తెలియ దండీ..." అన్నాడాయన అమాయకపు మొహం పెట్టి.

నాకు నవ్వొచ్చేసింది. "ఎప్పుడూ మీరిద్దరే వస్తారు, దివిజ్ వాళ్లమ్మగారు రారేం? ఆవిడ ఇక్కడ లేరా లేకపోతే ఉదయాన్నే ఇంట్లో పనా? ఇంకా చిన్నపిల్లలెవరైనా ఉన్నారేమో కదా..." అనేశాను చటుక్కున. అన్న తర్వాత గౌతమ్ మొహంలో మారిన రంగుల్ని చూశాకగానీ పొరపాటేదో జరిగిందని నాకు అర్థంకాలేదు. నా పెదవుల మీద నవ్వు అకస్మాత్తుగా మాయమైపోయింది. ఛ...

ఎందుకిలా నోరుజారాను... నాకేం పరిచయం ఉందని? దివిజ్ వాళ్లమ్మ వస్తే నాకేంటి, రాకపోతే నాకేంటి... అన్నీ ఆరాలు తియ్యడం ఎందుకూ... ఆలోచనలు కట్టిపెట్టి, "అయ్యో సారీ అండీ. మీ వ్యక్తిగత విషయాలు అడగటం పొరపాటే. ఏమీ అనుకోకండి. రేపు మాట్లాడదాం..." అంటూ అక్కడ నుంచి వచ్చేశాను.

స్కూలుకు వచ్చిన తర్వాత కూడా నా ఆలోచనలు ఆగలేదు. అపరాధభావన తగ్గలేదు. ఈమధ్య కాలంలో మహిళలు ఉద్యోగాల్లో ముందుంటున్నారు. సాఫ్ట్‌వేర్ వంటివాటిలో పనిచేస్తున్నవాళ్లు బిడ్డలను కుటుంబాన్ని వదిలి ఏడాదో రెండేళ్లో వేరే దేశాల్లో వేరే రాష్ట్రాల్లో ఉండటమూ మామూలయిపోయింది. తల్లిదండ్రులు విడిపోకపోయినా, విడివిడిగా ఉండాల్సి రావడంవల్ల అయితే తల్లితో లేదా తండ్రితో ఉంటున్న పిల్లలు ఎక్కువ అవుతున్నారు. మా స్కూల్లో పిల్లలను చేర్చుకుంటున్నప్పుడే తల్లిదండ్రుల వివరాలన్నీ తీసుకుంటారు. ఇలా అమ్మానాన్నల్లో ఒకరితోనే ఉండే పిల్లల మీద నేను ఎక్కువ శ్రద్ధ పెడుతుంటాను. స్టాఫ్ సమావేశాల్లో నేను నివేదికలిస్తున్నప్పుడూ, టీచర్లకు శిక్షణ క్లాసులు నిర్వహిస్తున్నప్పుడూ- ఇటువంటి పిల్లల మీద ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అనుకుంటుంటాం. సరిగా పట్టించుకోకపోతే ఇలాంటి పిల్లలు తమలోకి తాము ముడుచుకుపోవడం లేదా మరీ దుడుగ్గా తయారయే ప్రమాదం ఉన్నందువల్ల వారితో సున్నితంగా వ్యవహరించాలని ఇటు టీచర్లకూ అటు తల్లిదండ్రులకూ పదేపదే చెబుతుంటాను కూడా. దూరంగా ఉన్న అమ్మదో నాన్నదో ప్రసక్తి వచ్చినప్పుడు పిల్లలు బెంగపడటం, అన్యమనస్కంగా వ్యవహరించడం కూడా మేం గమనిస్తూనే ఉంటాం. ఇంత తెలిసీ మరి నేనెందుకలా మాట జారాను... నా అనుచిత ప్రవర్తనకు నాకే సిగ్గేసింది.

దివిజ్ తల్లి ఉద్యోగరీత్యా దూరంగా ఉందేమో. అయినా ఇటువంటి పిల్లవాణ్ని వదిలేసి వెళ్లడానికి మనసెలా ఒప్పిందో. లేదంటే గొడవల వల్ల విడిపోయిందేమో... అసలుందో లేదో... ఏదైనా ప్రమాదంలోనో, జబ్బుతోనో మరణించిందేమో... అలా అనుకోగానే ప్రాణం తల్లడిల్లింది. ఛీ ఛీ ఆలోచనలేమిటి ఇంత నెగెటివ్‌గా వస్తున్నాయి? ఒక్కసారి కళ్లు మూసుకుని దీర్ఘంగా శ్వాస తీసి వదిలాను.

అలా పదిసార్లు చేశాక మనసు కొంత కుదుటపడి దారిలోకొచ్చింది- దివిజ్ తల్లి ఇంట్లో ఉంది. ఉదయాన్నే పనివల్ల ఆమె రాలేకపోతోంది. సాయంత్రాలు ముగ్గురూ కలిసి బీచ్‌కి వస్తున్నారు. దివిజ్ తల్లితో వచ్చినప్పుడు కొంచెం నవ్వుతూ ఆడుకుంటాడు, ఇంటికెళ్లి హాయిగా నిద్రపోతాడు. వాడు మామూలువాడు కాదు గనుక తల్లి చాలా జాగ్రత్తగా చూసుకుంటుంది. వాడి భవిష్యత్తు కొచ్చిన ఢోకా ఏమీ లేదు- ఇలా అనుకున్నాక నాకు హాయిగా అనిపించింది. అయితే ఆమె గురించి అడిగినప్పుడు గౌతమ్ మొహంలో మారిన రంగుల మాటేమిటి? గుర్తు చేసుకుంటే కోపం, నిస్సహాయత, పశ్చాత్తాపం వంటివెన్నో కనిపించాయి అప్పుడాయన భావాల్లో. ఒక పల్చటి విషాదపు తెర కదలాడ్డం కూడా నాకు తెలిసింది. ఒకటి నిజం- వీటిని గమనించడంలో మాత్రం నేను పొరబడలేదు.

తర్వాత వారం పదిరోజుల పాటు ఉదయాన్నే సముద్రపుటొడ్డున ఆ తండ్రీ కొడుకూ నాకు కనిపించలేదు. ఎంత ధ్యానం చేస్తున్నా, ప్రాణాయామం చేస్తున్నా వాళ్ల గురించిన అలజడి నాలో తగ్గలేదు. కేవలం నా అత్యుత్సాహం వల్లే ఆయన ఇటు రావడం తగ్గించాడా? ఎవరూ ఇబ్బంది కలిగించని మరో చోటును ఎంచుకున్నారా లేదా అసలు బీచ్‌కే రావడం మానేశారా? నెమ్మదిగా వాళ్ల ఆలోచన నాలో పొగమంచులాగా కరిగిపోతుండగా పదిహేనిరవై రోజుల తర్వాత కనిపించారు మళ్లీ. ఎందుకో తెలియని ఆనందం నా మనసులో నిండింది. గొంతెత్తి పిలుద్దామా అనుకుని ఒక్క నిమిషంలో తమాయించుకుని మౌనంగా ధ్యానంలోకి వెళ్లాను. ఎంతో ఏకాగ్రత కుదిరింది. ఉదయిస్తున్న రవిబింబం భ్రూమధ్య బిందువై నిలిచిపోగా గొప్ప ధ్యానానుభవం నా సొంతమయింది. సముద్రపు ఉప్పునీటికి పాదాలు మురికి వదిలి తెల్లగా మారినట్టు నా మనసు నిర్మలమయిన భావన. కళ్లు తెరిచి చూసేసరికి నాకు దగ్గరగా నిల్చున్న గౌతమ్ కనిపించారు.

"హలో బావున్నారా?" అతను నవ్వుతూ పలకరించిన తీరుకు, 'హమ్మయ్య,' అనుకుని నా మనసు పద్మంలాగా వికసించింది.

"నన్ను క్షమించారన్న మాట..." నేనంటుండగానే, "అబ్బా అలాంటివన్నీ పెట్టుకోకండి. నేనే కాస్త మొరటుగా ప్రవర్తించాను ఆరోజు. సరే, మీక్కొంచెం టైముందా? ఆదివారమేగా, నేను కాస్త మాట్లాడాలి మీతో..." అన్నాడాయన.

"పర్లేదు చెప్పండి," అనగానే నాకు ఎదురుగా మఠం వేసుక్కూచున్నాడు. మాకు కాస్త దూరంలో దివిజ్. ఈసారి అతనితో పాటు ఎవరో ఒక పెద్దావిడ కూడా.

"ఆవిడ మా అమ్మగారండీ. వయసు అరవై ఐదు పైనే. ఇప్పటివరకూ అలవాటయిన ఢిల్లీలో పనులన్నీ చక్కబెట్టుకుని మొన్న వెళ్లి తీసుకొచ్చేశాను..." కాస్త ఆగి ఏదో చెప్పబోతున్నట్టు ఊపిరి తీసుకున్నాడాయన. "దివిజ్‌కి ఇప్పుడు పన్నెండేళ్లు. తన బట్టలు తాను వేసుకోలేడు. చూశారుగా, అసలు వాడికేదీ పట్టదు. మొన్నీ మధ్యన వరకూ అతి కష్టమ్మీద మనం వేస్తే బట్టలుంచుకునేవాడు. టీనేజ్‌లోకి వచ్చేస్తున్నాడుగానీ పసివాడిలాగా నన్ను కరచుకుని నా పొట్టమీద తలపెట్టి పడుకుంటాడు. నేను పగలంతా ఉద్యోగానికెళ్లిపోతే ఒక్కడూ ఉండలేడు. పనివాళ్లను పెట్టినా కష్టమే. ఇన్నాళ్లూ పెంచిన మా అమ్మ తప్ప మాకిద్దరికీ వేరే ఆధారమే లేదు. ఆవిడకు నేను తోడు, ఆవిడ వాడికి తోడు..." చెప్పాడాయన.

కేవలం కుతూహలం తప్ప మరింకే భావమూ వ్యక్తం చెయ్యకుండా శ్రద్ధగా వింటున్నాను నేను.

"దివిజ్‌కి ఏడాది వయసు రాకముందే ఏదో కాస్త తేడా ఉందని గుర్తించాం వాళ్లమ్మా నేనూ. అందర్లాగా బోసి నవ్వులు నవ్వేవాడు కాదు, మమ్మల్ని గుర్తించేవాడు కాదు. వాడి పేరు పెట్టి పిలిస్తే పలికేవాడు కాదు. కేవలం ఫ్యాను తిరుగుతుంటే తదేకంగా చూస్తూ పిచ్చిగా నవ్వేవాడు ఒకోసారి. అంతే. తర్వాతర్వాత డాక్టరుకు చూపించినప్పుడు వాళ్లు దివిజ్ ఆటిజమ్‌తో, అటెన్షన్ డెఫిసిట్ హైపరేక్టివిటీ డిజార్డర్తో బాధపడుతున్నాడని చెప్పారు. అయితే నాకు అప్పుడు కొత్తగా షాకులేం కొట్టలేదు. అటువంటిదేదో ఉండే ఉంటుందని మేం ఊహిస్తున్నదే. నాకు షాకు కొట్టిందెప్పుడంటే వాళ్లమ్మ వాణ్నీ వదిలేసి వెళ్లిపోవడానికి నిర్ణయించుకున్నప్పుడు!"

ఇది ఊహించలేదు నేను. దెబ్బ నాకే తగిలినట్టనిపించి ఉలిక్కిపడ్డాను. నా ఉలికిపాటును గమనిస్తూ గౌతమ్ కొనసాగించాడు.

"ఆశ్చర్యం అదే. ఆవిడ ఆ పని చాలా సులువుగా చెయ్యగలిగింది. తన నిర్ణయాన్ని నాకు చెప్పినప్పుడు దివిజ్‌లాంటి పిల్లాడు తల్లి లేకుండా ఎలా ఉండగలడని మాత్రం అడిగాను. ఏం చెప్పిందో తెలుసా? 'ఎంతమంది పిల్లలు అమ్మానాన్న లేకుండా పెరగల్లేదు? వాడు నీక్కూడా భారమే. ఏ అనాథాశ్రమంలోనే చేర్పించేసెయ్. హాయిగా అందరితోపాటే పెరుగుతాడు...' అందామె విసురుగా. ఆమె తీరుకు అక్కడే ఉన్న మా అమ్మ కళ్లు తిరిగి పడిపోయింది. ఎంత బతిమాలినా వినకుండా వెళ్లిపోయన ఆమె తర్వాత తక్కువ కాలంలోనే ఎవరినో పెళ్లి చేసుకుంది. కానీ ఆమె ఆ రోజు మాట్లాడినవి విని, వెళ్లిపోవడం చూసిన నేను మాత్రం మనిషిగా కోలుకోలేకపోయాను. నల్లటి చీకటి నిండిన గుహలో నన్ను విసిరేసినట్టనిపించింది. ఎన్ని రోజులు ఏడుస్తూ గడిపానో తెలీదు..."

"ఏదో సినిమా కథ వింటున్నట్టుంది," అన్నాన్నేను అతి కష్టమ్మీద గొంతు పెగల్చుకుని.

"మీకలా అనిపించడంలో తప్పేంలేదు. కానీ సినిమాల్లో, కథల్లో కూడా ఉండనంత నాటకీయత మన జీవితాల్లో ఉంటుంది. అటువంటిదొకటి రుచి చూడకుండా జీవితం గడిచిపోతే అదృష్టవంతులం కిందే లెక్క. ఆమె వెళ్లిన తర్వాత ఆర్నెల్ల పాటు నేను జీవచ్ఛవమైపోయాను. నామీద నాకే బోల్డంత జాలి. బుద్ధి పెరగని కొడుకును నా ఖర్మానికి వదిలేసి వెళ్లిపోయి ఎవరితోనో హాయిగా ఉంటున్న భార్య మీద ద్వేషం. ప్రపంచంలో కష్టమంతా నాకేనా... నాకొక్కడికే ఎందుకిలా జరగాలి... అని కుమిలిపోయేవాణ్ని. ఇంట్లో అమ్మే దివిజ్‌ను సాకేది. నన్ను సముదాయించలేక, వాణ్నీ చూసుకోలేక ఆమె నలిగిపోయేది. తర్వాత హఠాత్తుగా ఒకరోజు నాకు జ్ఞానోదయ మైంది. తల్లి లేకపోతే పోయె, తండ్రి ఉండీ లేనట్టు వాణ్నీ ఎందుకు వదిలెయ్యాలీ అని. అప్పట్నుంచీ నేను కాస్త మనుషుల్లో పడ్డాను. వాణ్నీ పట్టించుకోవడం మొదలుపెట్టాను..." ఏదో అప్పుడే తెరిపిన పడ్డట్టు చిన్న నవ్వు నవ్వాడాయన. 'అయ్యో' అని మాత్రం అనగలిగాను.

"కొంపదీసి మీరేమైనా నా మీద జాలిపడుతున్నారా ఏమిటి? నేనందుకు తగను. ఆవిడ అలా ప్రవర్తించడంలో నా పాత్రా ఉందిలెండి. ఎక్కువమంది మగవాళ్లలాగా నాకూ ఒక బండ ధైర్యం ఉండేది. నేనెలా ఉన్నా ఇల్లాలు ఇంట్లోనే ఉంటుందనీ, ఒకసారి పెళ్లయి పిల్లలు పుట్టాక ఆడవాళ్లు కుక్కిన పేనల్లే ఉంటారనీ అనుకునేవాణ్ని. నా ధ్యాసంతా ఉద్యోగం మీదా, అందులో పైకెదగడం మీదా సంపాదన మీదా మాత్రమే ఉండేది. ఆమెను నేనెప్పుడయినా పట్టించుకుంటే కదా. ఇంటిని చూసుకోవలసింది భార్య, సంపాదించాల్సింది నేను అన్నట్టుండేవాణ్ణి. ఆమె వెళ్లిపోయాక మా ఇద్దరి బంధం గురించి ఆలోచిస్తే ఆశ్చర్యం వేసింది. అసలు నాకు ఆమె గురించి ఏమీ తెలియదనిపించింది. అంటే నేను తెలుసుకోవాలనే ఆసక్తి చూపించలేదనేగా అర్థం! అంచేత నన్ను అయ్యో అనుకుంటే మీరు నరకానికి పోతారు చూసుకోండి..." అని నవ్వేశాడు గౌతమ్.

నేను కాస్త తేలికపడ్డాను. నాకూ చిన్నగా నవ్వొచ్చింది. దూరాన ఉన్న దివిజ్ వైపు చూశాను.

"వాడికి ఆరేళ్లప్పుడు వెళ్లిపోయిందావిడ. అప్పట్లో వాడు ఆమెకోసం చాలా ఏడ్చేవాడు. అమ్మా అమ్మా అంటూ ఇల్లంతా పదేపదే వెతికేవాడు. ఉద్యోగానికి వెళ్లింది వస్తుందని సాయంత్రమైతే చాలు ... బాల్కనీలో రెయిలింగుకు తలవాల్చి ఎదురు చూసేవాడు. ఎంత సేపయినా ఇంట్లోకి వచ్చేవాడే కాదు. బాల్కనీలో ఎండయినా వానయినా గంటలపాటు నిల్చునేవాడు, కదలకుండా వీధివైపు చూస్తూ. అది చూసి మా అమ్మకు హోరున ఏడుపొచ్చేసేది. ఎంత లాక్కొచ్చినా వచ్చేవాడు కాదు. చివరకు చేసేదేం లేక ఆవిడ బాల్కనీలోనే రెండు కుర్చీలు తెచ్చి వేసేది. ఇద్దరూ అక్కడే బోల్డంత సేపు కూచునేవారు..." వింటుంటే నాకు ఏడుపొచ్చేసినట్టయింది.

"తిండి తినడానికి, రాత్రి పడుకోవడానికి ఎంతో అల్లరి పెట్టేవాడు. అమ్మపెడితే తింటానని, అమ్మ వచ్చాకే పడుకుంటానన్నట్టు గోలగోల పెట్టేవాడు. వాణ్ని సముదాయించలేక మా ఇద్దరికీ తల ప్రాణం తోకకొచ్చేసేది. అమ్మయితే మా ఇద్దరినీ పట్టుకుని ఏడుపు. వాళ్లమ్మ గుర్తొచ్చినప్పుడల్లా దివిజ్ ఇల్లుపీకి పందిరేసేవాడు. అదంతా నెమ్మదిగా తగ్గిందనుకోండి. ఇప్పుడంత లేదు గానీ, అకస్మాత్తుగా వాడు వస్తువులు విసిరేస్తున్నాడంటే ఆమె గుర్తుకొస్తోందని మాకు తెలిసిపోతుంది. ఇంటికెవరైనా చుట్టాలో స్నేహితులో వస్తే దివిజ్ వాళ్లను తిరిగి వెళ్లనివ్వడు. గట్టిగా కౌగిలించుకుని వెళ్లొద్దంటూ కన్నీళ్లు పెట్టుకుని మారాం చేస్తుంటాడు. మీకు తెలియనిదేవుంది.... మామూలుగానైతే ఆటిజమ్ ఉన్నవాళ్లు ఇతరుల స్పర్శను సహించరు. కానీ దివిజ్‌లో వాళ్లమ్మ వెళ్లిపోవడం వల్ల కలిగిన అభద్రతాభావం వల్లనేమో, ఎవరొచ్చినా గట్టిగా పట్టుకుని వదలడు.

"ఆవిడ ఏడాదికోసారి వీడి పుట్టినరోజున వచ్చి చూసిపోతుంటుంది. ఆ రోజు వాడి సంతోషం చూడాలి అసలు. కానీ ఆమె వెళ్లిపోయాక నాకు పిచ్చి కోపం వస్తుంది. మనసంతా చేదుగా అయిపోతుంది. ఏదో తెలియని పశ్చాత్తాపం కూడా వెల్లువయిపోతుంది. చూడండి, మేం ఇద్దరం ఉద్యోగాలు చేసేవాళ్లం. పగలంతా పనిచేసి అలసిపోయి ఇల్లు చేరేప్పటికి పిచ్చి పిచ్చిగా ప్రవర్తించే బిడ్డ ఉంటే ఎలా ఉంటుంది. పైగా నేను పూచికపుల్ల పని ముట్టుకునేవాణ్ణి కాదు. వీడు ఇలాంటి బిడ్డ కాకపోతే మా బంధం బానే ఉండేదేమో. అప్పటికీ ఆమె మరో బిడ్డను కందామనే అడిగింది. ఏమో, ఆ బిడ్డ కూడా ఇలా అవకరంతో పుట్టరని ఏముంది? అప్పుడెలా పెంచుతాం. అందుకని భయం వేసి నేనే వద్దన్నాను. దానిక్కూడా ఆమె బాధపడే ఉంటుంది..."

ఏమీ చెప్పలేని మౌనంలో నేను. సమస్యలు, ముఖ్యంగా దంపతుల మధ్య సమస్యల్లో ఇతరులకు అర్థమయేది, ఏమైనా చేయగలిగేది ఆవగింజంత ఉంటుందేమో.

"మీరు మనస్తత్వ శాస్త్రం చదువుకున్నారని నాకు మీరంటే గౌరవం ఏర్పడింది. ఇప్పటివరకూ ఇంతలా ఎవరికీ నేను మనసు విప్పి చెప్పలేదు. ఎందుకో మీకు చెప్పాలనిపించింది..." అన్నాడాయన. కడిగిన ముత్యంలా తేటపడింది అతని ముఖం.

"ఈ ఆరేళ్లలో నేను చాలా మారానులెండి. ఇప్పుడు నా ప్రపంచమంతా దివిజ్ చుట్టూనే. ప్రశాంతంగా ఉంటుందని ఇక్కడకు మారాం. చుట్టూ కాస్త ఖాళీ స్థలం, మొక్కలు ఉండే ఇల్లు తీసుకున్నాం. నాకు వీలయినంత ఎక్కువ సమయాన్ని వాడితో గడుపుతుంటాను. మన ధ్యాసంతా వాడిమీదే ఉండాలనుకుంటాడండీ బాబూ. ఇక్కడ బీచ్‌లో అంత నిశ్శబ్దంగా కూచుంటాడా, ఇంట్లో మేం కప్పెగిరిపోయే స్థాయిలో ఆడుకుంటాం. అప్పటికీ మా అమ్మ కోప్పడుతూనే ఉంటుంది అరవకండ్రా అని. ఆవిడ ఈ వయసులో గుళ్లూగోపురాలూ, శుభకార్యాలూ... అంటూ ఎక్కడికీ వెళ్లదు. నిత్యం వాడితోనే ఉంటుంది..."

పెద్దావిడ సహనాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయాను. "ఇక్కడ మంచి స్కూళ్లున్నాయి. దివిజ్‌ని ఏదో ఒకదానిలో చేర్పిద్దాం. నేను చెబుతాను ప్రిన్సిపాల్‌కి. మీరు వెళ్లి కలవండి..." అని చెప్పి పైకి లేచాను. ఇద్దరం దివిజ్ వాళ్లున్న దగ్గరగా వెళ్లాం. వాళ్లమ్మగారికి నన్ను పరిచయం చేశారు గౌతమ్. ఈసారి దివిజ్ ఓ చిన్న నవ్వు నవ్వాడు నన్ను గుర్తించినట్టుగా. ఆ ఉదయాన దేవుడిచ్చిన బహుమతిలా తోచింది నాకది.

ఇప్పుడు దివిజ్ మంచి స్కూల్లో చేరాడు. ప్రతిదానికీ అరవడానికి బదులు నెమ్మదిగా మాట్లాడటం నేర్చుకుంటున్నాడు. తన తిండి తాను కింద మీదా పొయ్యకుండా శుభ్రంగా తినడం కూడా వచ్చింది. గొడవల్లేకుండా తోటి పిల్లలతో కలసిమెలసి ఆడుకుంటున్నాడు. అదేమిటో తెలీదు... వాడికి వంటంటే చాలా

ఇష్టం. ఏ ఛానెల్లో వంటల కార్యక్రమం వచ్చినా కన్నార్ప కుండా చూస్తుంటాడట. అవి చెయ్యమని వాళ్ల నాన్నమ్మని పోరు పెడుతుంటాడట. మా స్కూలుకొచ్చి కలిసిన గౌతమ్ ఇవన్నీ చెబుతుంటే నవ్వొచ్చింది. “పెద్దయ్యాక మా దివిజ్ మంచి షెఫ్ అయిపోతాడేమో అనిపిస్తోందండీ...” అని ఆయనా నవ్వాడు.

“నేనూ మా అమ్మా లేకపోయాక వీడు ఏమయి పోతాడోనని బెంగ నాకు. ఎక్కడ నేర్చుకున్నాడో మరి నిన్న రాత్రి, ‘ఐ లవ్యూ నాన్నా,’ అన్నాడు. నా గుండె చెరు వయిపోయిందంటే నమ్మండి...” అంటూ జేబులోంచి రుమాలు తీసి కళ్లూ ముక్కూ తుడుచుకున్నాడు గౌతమ్. వింటున్న నాకూ కన్నీళ్లు జలజలా రాలేయి.

“అన్నిటికీ ఏదో ఒక దారి ఉంటుందిలెండి,” అని ఊరడించబోతే, “చూడండి, నేనెంత దుర్మార్గుణ్నో. మీ మీద ఇంత భారం వేశాను కదా, మీ గురించి ఏమీ అడగ లేదు నేను. మీరు ఒక్కరే ఉంటారని తెలుసు. కానీ ఇంకే వివరాలూ తెలియవు...” అన్నాడు గౌతమ్.

“ఏం తెలియాలేమిటీ? ఏ బరువు బాధ్యతలూ లేవు. హాయిగా ఒంటరి జీవితం. స్కూల్లో పిల్లలకు చేతనైన సాయం చెయ్యడం ఉద్యోగ ధర్మం. ప్రతి ఉదయం యోగా. అంతే. ఇంకేం తెలుసుకుంటారు?” నవ్వాను.

“అంటే అదే... మీ తల్లిదండ్రులూ, పెళ్లీ పిల్లలూ...” అంటూ నాన్చేశాడు ఆయన. ఈ సంభాషణ ఎక్కడి వరకూ వెళుతుందో తెలుస్తోంది నాకు. ఒక్క క్షణం గుండె కొట్టుకుంది. మరుక్షణంలో, ‘వద్దు దీపా, అనవసరం, అప్రస్తుతం,’ అని మనసు నిర్ణయం తీసేసు కుంది. కుదుటబడ్డాను.

దివిజ్ పుట్టిన సంవత్సరమే నాకూ ఓ అమ్మాయి పుట్టింది. నాలుగు చేతులతో పుట్టిన పసిదాన్ని, ‘ఆహా, మహాలక్ష్మి పుట్టిందండీ... పెంచుకో బాగా... సిరులు కురిపిస్తుంది...’ అంటూ ఈసడించుకుని నా భర్త నా పురిట్లోనే వదిలేసి వెళ్లాడనీ, పుట్టిన వారంరోజులకే చనిపోయిన పాపను తల్చుకుంటూ ఇంతమంది పిల్లల మధ్య కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాననీ- ఇవేవీ నేను గౌతమ్ గారికే కాదు, ఎవ్వరికీ చెప్పను. ఎప్పుడూ చెప్పలేదు. ఆయనే చెప్పినట్టు కథలు, సినిమాలను మించిన నాట కీయత జీవితాల్లో ఉంటుంది. అది అనుభవానికి రాని వాళ్లు అదృష్టవంతులనే అనుకోవాలి. ఆ నిజాన్ని తల్చుకో గానే చిన్న నవ్వు మొలిచింది నా మొహంలో.

“సరేలెండి, మీరలా నవ్వుతూనే ఉండండి... అసలు నా మనసులో మాటేమిటంటే...” అని ఏదో చెప్పబోయాడాయన.

“అహ్, అవన్నీ వద్దులెండి. మీరింకేం చెప్పకండి. నేనున్నంత కాలం దివిజ్‌కేమీ ఢోకాలేదు. ఇక వెళ్లి రండి...” అని స్కూలు గది నుంచి పంపేశాను. తల వంచుకుని వెళుతున్న అతని మొహంలో ఏ రంగులు కదలాడాయో చూడనవసరం లేకుండానే నాకు తెలిసి పోయాయి. నేను కేవలం ‘అమ్మ’గానే ఉండదల్చు కున్నా.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 20 మార్చి 2011*

